## క్లుప్తంగా

### మంత్రిని కలిసిన యూత్‌ కాంగ్రెస్‌ నేత



మంత్రి దామోదరకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆదిత్య తదితరులు

పటాన్‌చెరు టౌన్‌: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను హైదరాబాద్‌లో యూత్‌ కాంగ్రెస్‌ రాష్ట్ర ప్రొటోకాల్‌ డిపార్ట్‌మెంట్‌ చైర్మన్‌ డాక్టర్‌ ఆదిత్య రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్‌ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు ధీరజ్‌ రెడ్డి, ఆతిక్‌, ముజాహిద్‌ వంశీ తదితరులు ఉన్నారు.

### కష్టాలతో అన్నదాతలు

ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌

సంగారెడ్డి: కాంగ్రెస్‌ ప్రభుత్వం వడ్లకు రూ.500బోనస్‌ ఇవ్వదు, రైతుల కన్నీళ్లు తుడవదు, పంటను అమ్ముకునేందుకు తిప్పలు తప్పడం లేదని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటను కాపాడుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే అక్కడ రైతులకు నిరాశే ఎదురవుతోందన్నారు. ఒక్కో క్వింటాలు ధాన్యానికి మూడు నుంచి ఆరుకిలోల వరకు తరుగు పేరిట కోతలు పెడుతున్నారని ఆరోపించారు. లారీల కొరతను నివారించి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు రవాణా చేయాలని డిమాండ్‌ చేశారు.

### జొన్న రైతులకు అండగా ప్రభుత్వం

కల్హేర్‌(నారాయణఖేడ్‌): జొన్న సాగుచేసిన రైతులకు ప్రభుత్వం అండగా నిలిచిందని మాజీ సీడీసీ చైర్మన్‌ వై.నర్సింహారెడ్డి, కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు మల్డొడ్డి తుకారాం, మాజీ పీఏసీఎస్‌ చైర్మన్‌ ఎం.వీర్‌షెట్టి తెలిపారు. బుధవారం కల్హేర్‌లో మాట్లాడుతూ కల్హేర్‌, మార్డి, కృష్ణాపూర్‌లో కొనుగోలు కేంద్రాలు ప్రాంభించారని చెప్పారు. ఎకరాకు 12.50 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.

### విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

నారాయణఖేడ్‌: ర్యాకల్‌, అబ్బెంద, చాప్టా(కె), తడ్కల్‌ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్‌ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఖేడ్‌ ట్రాన్స్‌కో ఏడీఈ నాగేంద్రకుమార్‌ తెలిపారు. చెట్ల కొమ్మలను నరికేందుకుగాను సరఫరాను నిలివేయనున్నామని చెప్పారు.

**జిన్నారం(పటాన్‌చెరు)లో..**

గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి, కానుకుంట, గుమ్మడిదల గ్రామాల్లో నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీకాంత్‌ తెలిపారు. 9నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్‌ పరిధిలోని మల్లన్నబస్తీ, జ్యోతినగర్‌, చర్చిబస్తీల్లోను విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు.

**అమీన్‌పూర్‌లో..**

లక్ష్మి హోమ్స్‌ ఓడీఎఫ్‌ కాలనీ, హెచ్‌పీ పెట్రోల్‌ బంక్‌ వెనక, ఆర్‌ ఆర్‌ హోమ్స్‌ హ్యాపీ హోమ్స్‌ సాయి విల్లా స్‌, గ్రీన్‌ విల్లాస్‌, ఎస్‌ఎస్‌ హోమ్స్‌, భరత్‌ నగర్‌లో విద్యుత్తు సరఫరా ఉండదని ఏఏఈ ఆర్‌.వెంకట్‌ రామ్‌ రెడ్డి చెప్పారు.

### ఆకట్టుకున్న కుస్తీపోటీలు



తలపడుతున్న మల్లయోధులు

నారాయణఖేడ్‌: మండలంలోని లింగాపూర్‌లో లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. కుస్తీలో విజయం సాధించిన మల్లయోధుడికి మూడున్నర తులాల వెండి కడియాన్ని నిర్వాహకులు బహూకరించారు.

### డ్రంకెన్‌ అండ్‌ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ అండ్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ 21మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లాకోర్టు జరిమానా విధించింది. సోమవారం, మంగళవారం నిర్వహించిన డ్రంకెన్‌ అండ్‌ డ్రైవ్‌లో 21మందిని పట్టుకున్నట్లు ట్రాఫిక్‌ సీఐ శ్రవణ్‌ కుమార్‌ చెప్పారు. పట్టుబడిన వాహన దారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి ఒక్కొక్కరికి రూ.2వేల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

# చెరువులు.. మురుగు కూపాలు

- వచ్చి చేరుతున్న చెత్తా, చెదారాలు
- గేటెడ్‌ కమ్యూనిటీల నుంచే..
- వాట్సాప్‌ గ్రూప్‌ల్లో వార్‌



చెరువు పరిసరాలను శుభ్రం చేస్తున్న నైబర్‌హుడ్‌ అసోసియేషన్‌ సభ్యులు

తెల్లాపూర్‌ చెరువులలోకి మురుగునీరు చేరడంపై వాట్సాప్‌ గ్రూప్‌లలో చర్చనీయంగా మారింది. రెండు రోజుల క్రితం తెల్లాపూర్‌ నైబర్‌హుడ్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో మేళ్ల చెరువు పరిసరాలలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. దీంతో ఈ అంశం వాట్సాప్‌ గ్రూప్‌లలో చర్చనీయంగా మారింది. తెల్లాపూర్‌ గ్రామస్తులు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తెల్లాపూర్‌ పరిధిలోని మేళ్ల చెరువు, వనం చెరువు, చేలికుంటలో ఒకప్పుడు స్వచ్ఛమైన నీరు ఉండేదని, ఆ నీటిని కూడా తాము తాగేవారమని గుర్తుచేశారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు):

నైబర్‌హుడ్‌ అసోషియేషన్‌ ఆధ్వర్యంలో చెరువుల పక్కన ఉన్న చెత్తను శుభ్రం చేస్తున్నారే తప్ప వారి గేటెడ్‌ కమ్యూనిటీ కాలనీ నుంచి చెరువులోకి మురుగునీరు రాకుండా ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అనేక మత్స్యకార కుటుంబాలు ఈ చెరువులపై ఆధారపడి జీవించేవారని, రియల్‌ ఎస్టేట్‌ పుణ్యమా అంటూ ఈ ప్రాంతంలో అనేక గేటెడ్‌ కమ్యూనిటీ కాలనీలు రావడంతో చెరువులు మాయం అవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**శుద్ధిచేసి బయటకు వదలాలి..**

ఆ కాలనీల నుంచి వచ్చే మురుగు నీటితోనే చెరువులకు ఈ దుస్థితి పట్టిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ గేటెడ్‌ కమ్యూనిటీ కాలనీలలో మురుగునీటి శుద్ధి ప్లాంట్‌లు ఉన్నాయా, ఉంటే అవి పనిచేస్తున్నాయా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఆ కాలనీలలోని మురుగు నీటిని ఎస్టీపీ ప్లాంట్‌లద్వారా శుద్ధిచేసి బయటకు వదలాలి. కానీ అనేక కాలనీలలో ఎస్టీపీ ప్లాంట్‌లు పనిచేయడం లేదని, ఆ మురుగు నీటిని చెరువులోకి వదులుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

**చర్యలు తీసుకోవడం లేదు..**

అధికారులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలనీవాసులు ఇక్కడికి వచ్చి చెరువు పరిసరాలను శుభ్రం చేయడం మంచి కార్యక్రమమే కాని వాళ్ల కాలనీలలో నుంచి మురుగునీరు చెరువులోకి రాకుండా ఎందుకు అడ్డుకోలేకపోతున్నారని వాపోతున్నారు. ప్రస్తుతం తెల్లాపూర్‌ నైబర్‌హుడ్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో గ్రీన్‌ ఆర్మీ గ్రూప్‌ను ఏర్పాటుచేసి ప్రతి ఆదివారం చెరువు పరిసరాలను శుభ్రం చేస్తామని చెబుతున్నారు. కానీ గ్రామస్తులు మాత్రం చెరువు పరిసరాల సంగతి మున్సిపల్‌ అధికారులు చూసుకుంటారు.. మీ కాలనీల నుంచి మురుగునీరు చెరువులోకి రాకుండా చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ సమస్య ఎక్కడికి దారితీస్తుందో వేచి చూడాల్సిందే.

**గతంలో ఫిర్యాదు చేశాం**



చెరువులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. చెరువులోకి మురుగునీరు రావడంపై అధికారులకు ఫిర్యాదు చేశాం. గేటెడ్‌ కమ్యూనిటీ కాలనీలలో ఎస్టీపీ ప్లాంట్‌లు పనిచేస్తున్నాయా లేదా అని పరిశీలించాలని అధికారులను కోరాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులోకి మురుగునీరు వదిలేవారిపై చర్యలు తీసుకోవాలి.

– ఈశ్వరిగారి రమణ, నైబర్‌హుడ్‌ అధ్యక్షుడు

**క్షేత్రస్థాయిలో పర్యటించాలి**



చెరువు పరిసరాలను శుభ్రం చేయడం మంచి కార్యక్రమమే కాని చెరువులోకి మురుగునీరు రాకుండా వారు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదు. గేటెడ్‌ కమ్యూనిటీ కాలనీల నుంచే మురుగునీరు చెరువులోకి వస్తోంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు తీసుకోవాలి. అప్పుడే చెరువులను కాపాడుకోగలుగుతాం.

– వడ్డే నర్సింహులు, తెల్లాపూర్‌

## లక్ష మల్లెపూలతో విశేష పూజ

బీహెచ్‌ఈఎల్‌ టౌన్‌షిప్‌లోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని విశేషంగా అలంకరించి లక్ష మల్లెపూలతో పూజచేశారు. నిత్యంహోమం, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు):



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి

# జొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్‌..

కంగ్టి(నారాయణఖేడ్‌): మండలంలో అధికారులు జొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. సాక్షిలో వచ్చిన 'పరిమితి పెంచారు.. కొనుగోలు ఆపారు' అనే కథనానికి మార్క్‌ఫెడ్‌ అధికారులు స్పందించారు. దీంతో మండల కేంద్రంతోపాటు నారాయణఖేడ్‌ నియోజకవర్గంలో జొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు.



జొన్నలు కొనుగోలు చేస్తున్న దృశ్యం



తనిఖీచేస్తున్న ఏడీఏ నూతన్‌ కుమార్‌

### కొనుగోలు కేంద్రం తనిఖీ

నారాయణఖేడ్‌: మనూరులోని జొన్నలు, నల్లకుసుమ కొనుగోళ్లలో రైతుల ఇబ్బందులపై సాక్షి దినపత్రికలో బుధవారం 'కళ్లెదుటే దగా!' శీర్షికన ప్రచురితమైన కథనానికి వ్యవసాయశాఖ ఏడీఏ నూతన్‌ కుమార్‌, మనూరు తహసీల్దార్‌ వెంకటస్వామి కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలో సరుకులు పేరుకు పోవడం, లారీలు రాకపోవడం అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఏడీఏ వివరించారు.

### ధాన్యం కొనుగోలు ప్రారంభం

హత్నూర(సంగారెడ్డి): సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'గింజ కొంటే ఒట్టు..' అనే కథనానికి అధికారులు బుధవారం స్పందించారు. జిల్లా పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్లు సుజాత చౌహన్‌, షాజీయొద్దీన్‌, డీసీసీబీ ఏఆర్‌ హోమ్‌ సింగ్‌ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు షేర్‌ ఖాన్‌ పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి కొనుగోలును ప్రారంభించారు. ఈ కేంద్రంలో సుమారు 4వేల బస్తాల వరకు ధాన్యం ఉండగా 600బస్తాలను తూకంవేసి రైస్‌ మిల్‌ కు పంపించినట్లు అధికారులు తెలిపారు.



కొనుగోలును పరిశీలిస్తున్న అధికారులు

కూలీల కొరత వల్లనే కొనుగోలు ఆలస్యం జరిగిందని, మూడునాలుగు రోజుల్లో కొనుగోలు పూర్తవుతాయని సీఈఓ శ్రీనివాస్‌ తెలిపారు.

# జీవవైవిధ్యంతోనే మానవ మనుగడ

ఎంపీడీవో యాదగిరి

పటాన్‌చెరు టౌన్‌: జీవవైవిధ్యం లేనిదే మానవ మనుగడ లేదని ఎంపీడీవో యాదగిరి అన్నారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం తెలంగాణ జీవవైవిధ్య మండలి, పర్యావరణ పరిరక్షణ శిక్షణ సంస్థల సహకారంతో నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో కలసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో పాల్గొని జీవవైవిధ్యం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ రాజేంద్రప్రసాద్‌, నిర్వాహకుడు డాక్టర్‌ శ్రీహరిరెడ్డి జీవవైవిధ్య పరిరక్షణకు తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో రఘునందన్‌, రాధిక, స్వాతి, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ యాదగిరి

# సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

జహీరాబాద్‌: సేంద్రియ వ్యవసాయ విధానంలోని ప్రయోజనాల గురించి శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం మొగుడంపల్లి మండలంలోని పలు తండాలకు చెందిన మహిళా రైతులకు డీడీఎస్‌–కేవీకే ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సేద్య పంటల శాస్త్రవేత్త వి.రమేశ్‌ మాట్లాడుతూ రైతులు సేంద్రీయ విధానంలో పంటలను సాగు చేయాలన్నారు. పంచగవ్య, ఘన జీవామృతంను ఎలా తయారు చేసుకోవాలో ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. పంటలను సోకే చీడపురుగులను ఎలా నివారించుకోవాలో తెలిపారు. భూసార నిపుణుడు ఇ.స్వామి మట్టి పరీక్షలు చేయించుకునే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో జాంగార్‌ బౌలి తండా, ఉప్పర్‌పల్లి తండా, మన్నాపూర్‌ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రమేశ్‌

# దొడ్డు వడ్లకు బోనస్‌ ఇవ్వాలని డిమాండ్‌

సంగారెడ్డి టౌన్‌: జిల్లాలో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, అలాగే విత్తనాల సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్‌ చేశారు. బుధవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అకాల వర్షాలతో ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దొడ్డు వడ్లకు కూడా రూ.500 బోనస్‌ ఇవ్వాలని డిమాండ్‌ చేశారు.

# నిషేధిత పత్తి విత్తనాల పట్టివేత

- ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్న ఎస్‌ఓటీ పోలీసులు
- రూ.6 లక్షల విలువ చేసే 240 కిలోల విత్తనాలు స్వాధీనం



దాడిలో పట్టుబడ్డ విత్తనాలు

మొయినాబాద్‌: నిషేధిత పత్తి విత్తనాలను తరలిస్తున్న ఆటోను ఎస్‌ఓటీ, శంకర్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.6 లక్షల విలువ చేసే 240 కిలోల నిషేధిత విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం వెలిమల గ్రామానికి చెందిన శివశంకర రావు, శంకర్‌పల్లి మండలం ఎల్వర్తికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌పల్లికి చెందిన ఉదయ్‌కిరణ్‌, హరిబాబు నలుగురు వ్యాపారం నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు చెందిన విత్తనాల సప్లయర్‌ శ్రీనివాస్‌రావుని కలిసి బీజీ–ఐఐఐ/హెచ్‌టీ(ప్రభుత్వం నిషేధించిన) పత్తి రకం విత్తనాలను కిలో రూ.2,500 చొప్పున రూ.6 లక్షల విలువ చేసే 240 కిలోలు కొనుగోలు చేశారు. వాటిని ఆటోలో తరలిస్తుండగా బుధవారం తెల్లవారు జామున శంకర్‌పల్లి మండలం ఎల్వర్తి సమీపంలో రాజేంద్రనగర్‌ ఎస్‌ఓటీ పోలీసులు, శంకర్‌పల్లి పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. ఆటో డ్రైవర్‌తోపాటు శివశంకర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, ఉదయ్‌కిరణ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 240 కిలోల నిషేధిత పత్తి విత్తనాలు, సెల్‌ఫోన్‌, రూ.2500 నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు సప్లయర్‌ శ్రీనివాస్‌రావు, హరిబాబు పరారీలో ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

### గెస్ట్‌ టీచర్ల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

జహీరాబాద్‌ టౌన్‌: మండలంలోని హోతి(కె) బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో గెస్ట్‌ టీచర్ల ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ విజయ ఓ ప్రకటనలో తెలిపారు. గణితం, భౌతిక, రసాయన, జంతు, వృక్షశాస్త్రాలతోపాటు తెలుగు, సంస్కృతం, సాంఘికశాస్త్రం బోధించేందుకు ఆసక్తికలవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జూన్‌ 2న ఉదయం 10గంటలకు నిర్వహించే డెమోకు హాజరుకావాలని పేర్కొన్నారు. అలాగే మునిపల్లి మండలంలోని లింగంపల్లి బాలుర గురుకుల పాఠశాల, కళాశాలల్లో బోధించేందుకు కూడా గెస్ట్‌టీచర్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్‌ సురభి చైతన్య తెలిపారు.

### అక్రమ నిర్మాణాలపై సమాచారం ఇవ్వరా..

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్‌ పరిధిలోని పలు ప్రభుత్వ భూముల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై ఆర్‌టీఐకి దరఖాస్తు చేసుకున్నా మున్సిపల్‌, రెవెన్యూ అధికారులు సమాచారం ఇవ్వడం లేదని కాంగ్రెస్‌ నేతలు ఆరోపించారు. బుధవారం బొల్లారంలో కాంగ్రెస్‌ యువజన నాయకులు ఇమ్రాన్‌ తదితరులు మాట్లాడుతూ బొల్లారం మున్సిపల్‌ పరిధిలోని పలు ప్రభుత్వ, శిఖం భూముల్లో అక్రమ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఆ వివరాలను సమాచార చట్టంద్వారా ఇవ్వాలని కలెక్టర్‌కు దరఖాస్తు చేసి రెండు నెలలు గడుస్తున్నా వివరాలు ఇవ్వడం లేదని ఆరోపించారు.

### సౌకర్యాలు కల్పించాలి

మునిపల్లి(అందోల్‌): విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఎంపీడీఓ హరినందన్‌రావు ఆదేశించారు. మరమ్మత్తుల కొసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని గుర్తుచేశారు. పాఠశాలల పునఃప్రారంభంలోగా పెండింగ్‌ పనులు పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. టాయ్‌లెట్లు, తాగునీటి సౌకర్యం, అదనపు తరగతుల నిర్మాణం పనులను పూర్తిచేయాలని కోరారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

పటాన్‌చెరు: మండలంలోని రుద్రారం సమీపంలోని ఓ ప్రైవేట్‌ ఫంక్షన్‌ హాల్‌లో మంజీరా జూనియర్‌ కళాశాలకు చెందిన 2007–2009 ఇంటర్‌ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అప్పట్లో విద్యను బోధించిన అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ 15 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు.

# చెరువు శుద్ధి చేపడతాం

- రూ.16 కోట్లతో ప్రణాళిక
- కమిషనర్‌ జ్యోతి రెడ్డి



వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌ పెద్ద చెరువును శుద్ధి చేస్తామని, మురుగునీరు చేరకుండా రూ.16 కోట్లతో ప్రణాళిక రూపొందిస్తున్నామని కమిషనర్‌ జ్యోతి రెడ్డి తెలిపారు. వివిధ కాలనీల నుంచి వచ్చి చేరుతున్న మురుగునీటితో పెద్దచెరువు దుర్గంధం వెదజల్లుతోందని కాలనీవాసులు చైర్మన్‌ను బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ మురుగునీరు చెరువులో కలుషితం కాకుండా వేరేమార్గం ద్వారా బయటికి పంపిస్తామని, అందుకు ప్రణాళికలు వేస్తున్నారని తెలిపారు. నివేదికను ప్రభుత్వానికి పంపించి నిధులు మంజూరు కోరుతామని చెప్పారు. కార్యక్రమంలో బ్రహ్మానందరావు, పూర్ణచంద్రరావు, రాంబాబు, వెంకటప్పయ్య, కేఎల్‌ మోహన్‌, ఎంఎస్‌ బాబు, పుండరీకాక్షశర్మ, రఘురామ్‌, ఉమాదేవి, ధర్మారావు, కోటేశ్వరరావు, సాయిబాబు, జీవన్‌ పాల్గొన్నారు.

# మొక్కలు సిద్ధం చేయాలి

ఎంపీడీఓ శ్రీనివాస్‌

కంది(సంగారెడ్డి): నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా చూడాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌ సూచించారు. బుధవారం కంది మండల పరిధిలోని కాశిపూర్‌, కలివేముల, చెర్లగూడెం గ్రామాల్లో వననర్సరీలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో నాటేందుకు మొక్కలను సిద్ధం చేయాలని, గ్రామానికి 5వేల చొప్పున మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్‌ రెడ్డి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్‌ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఇష్టానుసారంగా నిర్మాణాలు..



ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లు

మండలంలోని హనుమాన్‌ నగర్లో సర్వేనెంబర్‌ 404లో సుమారు 200ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉంది. అందులో కొంత భూమిని ప్రభుత్వ పాలిటెక్నిక్‌ పాఠశాలకు కేటాయించారు. మరికొంత భూమిని ఇళ్లులేని పేదలకు అందజేశారు. అయితే ఆ మిగిలిన భూమిని ఆక్రమించుకొని కొందరు తమ ఇష్టానుసారంగా ఇళ్లను నిర్మిస్తున్నారు. అనుమతులు లేకుండా ఇళ్లు నిర్మిస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

– సంగారెడ్డి టౌన్‌:

## వరద నీటిలో సాగేదెలా..



గుంతలో చేరిన వరదనీరు

మండల పరిధిలోని మామిడి పల్లిలో ఇళ్ల మధ్య నిలిచిపోయిన వర్షపు నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ ప్రధాన రహదారిపై ఉన్న చౌరస్తాలో ఏర్పడిన గుంతలో వరదనీరు నిలిచిపోతోంది. గ్రామంలోకి రావాలంటే ఈదారి గుండానే రావాల్సిఉంటుంది. ఇటీవల యన్‌ఆర్‌జీయస్‌ నిధులతో ప్రధాన కూడలి వద్ద సీసీ రోడ్డు వేసినా ఈ గుంతను పూడ్చకపోవడంతో వరదనీరు నిలిచి చెరువును తలపిస్తోంది. దీంతో వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– కంది (సంగారెడ్డి):